# దొంగ చెవులు

ఆపొద్దు తెల్లారే కాడికే నేను అచ్చాపచ్చా తీర్చుకుంటి. మా బాశాలి నా మింద దయతల్సి నట్టుండాది. నాజోలికి రాలా. 'బతికించినావురా దేముడా' అని బయటపడే దానికి ఎలబార్తా ఎలబార్తా ఉండా! అంతలోనే మా బాశాలి–

''మీ అయ్యను యిట్టొకసారి పిలమ్మా!'' అని తన కూతుర్తో అనె.

ఆబిడ్డ కాళ్లు సాపేసి తీరుబాటుగ్గా కూసోని పాత పేపర్ వొగిటెత్తి ముందరేసు కునింది. తల్లో పేండ్లు దువ్వుకుంటా ఉండాది. వాసాలకంగా పెరిగి పాయ్‌న కురులు గదా? రొండు పాయలుగా చీలి రొండు చెవుల్ని కప్పేసి ఉండాయి. వాళ్లమ్మ మాట చెవుల్లో పడిందో? లేదో? ఇత్తనాలు యిత్తిన చేన్లో మానుతోల్నెట్టు ఆబిడ్డ తల్లో చెక్కదూనేసి అదిం పట్టి ఈడస్తా ఉండాది.

''ఏమే? నీగ్గాదంటే చెప్పేది?'' మా బాశాలి మల్లా ఒక సారి కసిరె!

అప్పటికి కొంప చంద్రగిరి కోటంత ఉణ్ణెట్టూ... ఆ కోటలో వొక అంతఃపురం ఉణ్ణెట్టూ... ఆ అంతఃపురంలో రాణివాసాన ఉండే రాణెమ్మ– 'వాణ్ణి పిలవ్! ఈణ్ణి పిలువ్!' అని చెలికత్తెల్తో చెప్పినట్టు మా బాశాలి కూతుర్తో చెప్తా ఉండాది.

అసలా కొంప ఉండేదే అట్ట బారడు యిట్ట మూరడు! 'జానడింట్లో మూరడు కట్టె ఎట్ట కొడ్తావో కొ(త్రా బంగారి మొగడా?' అనే యవ్వారం. ఆ కొంపలో గుసగుస మాట్లాడుకోవాలంటే గుట్టు రట్టే! ఇదంతా ఆపెకు తెల్దనా? తెలిసీ కూతుర్ని అడ్డంపెట్టుకోని నన్ను పిలస్తా ఉండాదంటే ఏందో కత ఉణ్ణెట్టే లెక్క. ఆ కత ఎట్ట పొయ్యి ఎట్టొచ్చి యాడ ఎట్టా మలుపు తిరిగితిందో? ఈపొద్దు నిద్దర లేసిన యాళాయిశేషం ఎట్టుండాదో? అని జంకతా జంకతానే పొయ్ మా బాశాలికి ఎదురుంగా నిలబడ్తి.

గుడ్లు ఉరమతా ఆపె నన్నొకసారి ఎగాదిగా చూసె.

నాకు వొళ్లంతా చెమట్లు పోసె.

''ఈ కొంపలో నన్నేమన్నా ఉండమంటావా? లేదు నెత్తిన గుడ్డేసుకోని తూరుపుగా పొమ్మంటావా?''

''నన్నట్టా ఉత్తరంగా దొరిపోనీ. మల్లాగావాలంటే నీ దిక్కు నువ్వు ఎతుక్కుందువు''

''నీ కన్నా ముందు నేనే పోయేటట్టుగా ఉండాదే?''

''పసుపు కుంకంతో పొయ్యింది. పుణ్ణాత్తురాలు అనుకుంటార్లే'' అని అందామని నోటిదాకా వస్తే దాన్ని అట్నే నమిలేసి-

''ఇయ్యరవదాకా తూరుపుగా అంటివి. ఇప్పుడు దోసె తిప్పించినట్టు ఉత్తరంగా అంటా మాటతిప్పించేస్తే ఎట్నే? ఊరు చూడమంటే ఉత్తరంచూసే యవారమంటే యిట్టాంటి దేనేమో?''

''ఊరంతా ఒక దోవ అయితే ఉలిపికట్టెదొక దోవ అంటారు. ఈ యాదిలో యిన్ని కొంపలుండాయి. ఏ కొంపలో ఎతికినా దొరకదమ్మా!''

''పుట్టాని గింజ పుట్టేది. దొరకరాని మొగుడు దొరికేదంటే''

''నా అదురుష్టమే!... ఆ మాట యిక్కన పక్కన అడిగితే...''

''ఈకాలంలో యిక్కన పక్కన అడిగితే ఆపూట ఎసుట్లోకి పుట్టవుగానీ పెడార్తం మాట్లకు ఏముండాది లేయే?... దుడ్డూ దుగ్గాణీ లేని పని గదా?...''

''పొర్లించుకోని వచ్చే వాడి మాదిర్తో యిచ్చు యిలంబరమంటా పొద్దుతో గూడా ఎలబార్తావు. సగం రేత్తిరి కాడ నువ్వొచ్చి తలుపు తడ్తా ఉంటే యిక్కన పక్కన ఎంతమంది తలుపులు తెరస్తారో తెల్సా?''

''నాకోసరమా?''

''సగం చచ్చి ముక్కాలు మురిగి మద్దేణం తిరిగి మావిటేళకు ఎసుర్లు పెట్టుకుండే యోళై పాయ. ఇంకా ఎందుకే ఆ యాసణ్ణం?''

''లేకుండాపోతే యిది నాకొంప. ఇది నా తలుపు. నేను తట్టుకుంటా కావాలంటే పగల కొట్టుకుంటా. ఈళ్లకేమి? ఈళ్ల యింటి తలుపు లేమన్నా తట్నానా? ఈళ్లెందుకు తలుపులు తీసుకోవాల?''

''తలుపులు తీసుకుణ్ణా పరవాలేదే? లైట్లుగూడా ఏసుకోకుండా సీగిట్లో నిలబడు కోని మన కొంప కల్లానే గదా చూపు!''

''ఎందుకు ఈడ ఎవురన్నా యిప్పేసి తిరగతా ఉండారనా?''

''ఇడ్సేసినోడు యీదికి పెద్ద అన్నెట్టు నువ్వు అంతపని చేసినా చేద్దువు. అదిగాదే అసలు కత. ఆయాళకాడ తాము గుర్రమెక్కేసి ఉంటారు గదా? అప్పుడు తమరి చిర్రు బుర్రు యేరేగా చెప్పాల్నా? మొగిలిపువ్వుతో నువ్వట్టంటే మొద్దు పొరకతో నేనిట్టంటి! - అన్నెట్టు నువ్వొక మాట నేనొక మాట. చెటీపటీగా పడ్తావుంటే యిందామని!''

''ఇంటే వాళ్లకేం వస్తిందే?''

''కొంత మందికి అదొక కుశాల!''

''మనవల్ల యిరుగు పొరుగు అంత కుశాల పడ్తావుంటే మనం యింకా కుశాల పడాల గదా?''

''అయ్యు! అయ్యు! కొంచిమా నంచిమా? శానా కుశాల పడాలగానీ. నువ్వు యాడికైనా దోరిపో. ఎప్పుడైనా రా. ఎట్టయినా రా. కొంపకొచ్చి మాత్రం మీటింగులు పెట్టకోబాక''

ఇడ్సి పెట్టిందే సాల్లా నా సామీ! అనుకుంటా యీదిన పడ్తి.

మణిసి ముందుకు మణుసేమో ఎనక్కు!

ఆలూ మొగుళ్ల మాట్లంటే యీదిలో యిక్కన పక్కనోళ్లకు ఎందుకంత మునాస? ఒకరు మాట్లాడుకుంటా వుంటే యింకొకరు యినాలనే మునాస ఈళ్లకే ఉంటిందా? అందురుకీ అట్నే ఉంటిందా? అసలు ఎందుకు యినాలనిపిస్తింది. ఇనిందాని వల్ల దమ్మిడి లాబం ఏమన్నా ఉంటిందా? లేక పాయ్‌నా ఎందుకు యినాలను కుంటారు? యిని ఏం చేస్తారు? అని మణుసు పరి పరి యిదాల పోతానే ఉండాది.

ఎవుడు యాడపోతే మనకేం? ఎవుడు ఏం మాట్లాడుకుంటే మనకేం? అని కొందురు వాళ్లపనేమో వాళ్లేమోగా వాళ్ల దోవన వాళ్లు పోతా వుంటారు.

అటుమంటోళ్లు కారివేదులు!

పంగమాల్నె మంగలోడు పిల్లి తలకాయ గొరిగినట్టు యాడేం దొరికితిందా? అని అదే పనిగా తిరగతా ఆడమాట్లు ఈడ ఈడ మాట్లు ఆడ ముట్టించి జుట్లు పట్టించే వాళ్లుంటారు.

ఈళ్లు తంటల మారోళ్లు!

పొద్దుపోకుండా ఎవురేం చెప్పినా కొందురు నోరు తెర్సుకోని యింటా వుంటారు.

ఈళ్లు సోంబేరోళ్లు!

ఇట్టా మాదిరి లోకంలో ఎన్నో రకాల మణుసులు ఉంటారు.

అసలు ఒకరి మాటలు యినాలనే మునాస మణిసిలో ఎందుకు కలిగితింది? ఒకరంటే వొకరికి కానప్పుడు వొకిరిమిందొకరు నిగా పెట్తారు. అట్ట పెట్నా అంతో యింతో అర్తం ఉంటింది. అట్టగాకుండా యాడైనా యిద్దురు నిలబడుకోని మాట్లాడుకుంటా వుంటే మూడోవాడి చెవులు ఆడికెందుకు పోతాయ్. ఆ మాదిర యినేది గూడా శానా అరుసోద్దింగా ఉంటింది.

ఎప్పుడైనా రైల్లోనో బస్సులోనో కూసోని పోతా వుంటాం గదా? అదే బస్సులోనో రైల్లోనో పాయం మిందుండే ఒక పిల్లా పిలగాడు గూడా ఉండారనుకోండి. పాపం! వాళ్లేమో వాళ అచ్చట ముచ్చటల్లో వాళ్లుంటే వాళ్ల చుట్టూ ఎన్ని చెవులు ఉంటాయో తెల్సునా?

''చిలకా గోరింకిల మాదిరుండారు. వాళ్ల కుశాల వాళ్లది. పాపం! వాళ్లతో మనకేం పన్లే?'' అనుకోరే!

ఒకడు కోడి నిద్దర నటిస్తా చూడనట్టే వాళ్ల కల్లా చూస్తా ఉంటాడు.

ఇంకొకడు సిగరెట్టు పొగ రింగులు రింగులుగా యిడ్సి పెట్టా ఉంటాడు.

చూపేమో వాటికల్లా. చూసేదేమో ఈళ్లకల్లా! చెవులా వాళ్ల చుట్టే!

ఇంక కొందురుంటారు. ఎవురన్నా యిద్దురు మాట్లాడ్తా ఉన్నంటే చేసే పని యిడ్సి పెట్టేసి వాళ్ల కల్లానే చూస్తా ఉంటారు.

మా ఊళ్లో చెంగమ్మత్త ఉండె. అత్త మాట్లు కోడాలికి కోడాలి మాట్లు అత్తకు ముట్టిస్తానే బతుకు ఎల్నీదుకోని పాయ!

మరికొందురు మహన్నబావులుంటారు. ''ఈ బతుక్కుపాయ్ ఒక పార్టీ గూడానా? మాకే పార్టీ లే.'' అంటానే ఉంటారు. మల్లా అన్ని పార్టీ వాళ్లతో ఉంటారు. ఆడమాట్లు ఈడ... ఈడమాట్లు ఆడ చెప్తానే జల్సాగా పార్టీలు చేసుకుంటారు. ఇందుకేనేమో పెద్దోళ్లు పుర్రి కొక బుద్ది నాలిక్కి ఒక రుచి! అన్నారని అనుకుంటా ఆ నాలుగ్గాళ్లమండపం కాడికి పోతి!

ఆడ ఒక ముగ్గురు నలుగురు. ఒకొకరి చేతిలో ఒక నూస్ పేపర్ ఉండాది. వాళ్లు మాట్లాడ్తా ఉండారా? పోట్లాడ్తా ఉండారా? రొండూ తెల్లా. వాళ్ల చుట్టూరా ఎట్టలేదన్నా ఒక ఇరవై ముప్పైమంది ఉడ్డ చేరుకున్నారు. నోర్లు తెర్సుకోని వాళ మాట్లు యింటా ఉండారు.

వాళ్ల మాట్ల మింద నేను ఒక చెవ్వు పెట్టి!

''ఒరే నువ్వు వెయ్యి చెప్పు. లక్ష చెప్పు. సాపర్దాయకుడంటే అట్టుండాల్రా. పార్లమెంట్లో ప్రెదాని 'రాజీనామా చెయ్!' అంటే మాట్తో గూడా చేసి పారేసె. నిజింగా రోసగాడంటే కర్నాటక ముక్కెమంత్రేరా.''

''ఒరే నా తండ్రీ!... వొరే! నా నాయినో! అందురూ అదే మాదిర రోసగాళ్లయితే ఇప్పుడుండే ప్రెదానులు ముక్కెమంత్రులు ఒక్కరు గూడా పదవుల్లో ఉండలేర్రా! సంసారికి సంసారి అంటే కోపం ఉండ గూడదు. ఎవుడైనా మొకాన కారి ఊసినాడనుకో నవ్వతా తుడ్సుకోని పొయ్యేటోడే చలామణి అయిపోతాడు.''

''అది సరేలే! ప్రెదాని అడగచ్చు. ప్రెజలూ అడగచ్చు. అంత మాత్రాన కర్నాటక ముక్కెమంత్రి ఎందుకు రాజీనామా చెయ్యాల?''

''కొందురి ఫోన్‌ల మింద నిగా పెట్నాడని!''

''నిగా ఎందుకు పెట్టాల్సి వొచ్చింది?''

''ఎవురేం మాట్లాడకుంటా ఉండారో యినేదానికి!''

''ఎందుకినాల?''

''ఎందుకినాలంటే ఎవురేం గుంతలు తొవ్వతా ఉండారో తెల్సుకుండే దానికి!''

''ఈడు సుద్దంగా ఉంటే ఎవుడేం మాట్లాడుకున్నా ఎట్టా గుంతలు తొవ్వ గలగతారు?''

''ఆ మాట కొస్తే ఎవుడు సుద్దంగా ఉండార్లేరా? ఇప్పుడు ఈళ్లు గూడా అంటా ఉండ్లా! మేము బెంగుళూర్లో నోరు తెరిస్తే డిల్లీలో పేగులు లెక్క పెట్టేస్తా ఉండారని!''

''వాడోడి పని వాడు సుద్దంగా చేసుకుంటా పోతా వుంటే పేగులు లెక్క పెట్టుకుంటే ఏమి? ఎంచెంచి పెరుక్కుంటే మాత్రం ఏమిరా?''

''ఈళ్లయినా యింతే! వాళ్లయినా అంతే! పదిమందిని ఉద్దేసుకోని బతికే వాళ్లకు పాము చెవులుండాల్సిందే?''

''పదిమంది కోసరం అయితే పాము చెవులుణ్ణా పరవాలే. అది గాదే కత!''

''అది గాక పోతే నీకతా నాకతేనా వాళ్లకు కావాల్సింది. మన మేమన్నా డేంజిరా వాళ్లకు? డేంజిర్ మణుసులు యేరేగా ఉంటారు. అటు మంటోళ్ల మాట్లయితే దొంగచాటుగా యినాల. ఇనకుండాపోతే దెబ్బ గదా? అందుకనే వాళ్ల జాగర్తలో వాళ్లు. ఈళ్ల జాగర్తలో ఈళ్లు. ఎట్టా జాగర్తలేని ఎరిముండలు మనమే గదా''

'' మనం ఎరిముండలం కాబట్టే మనదుడ్లతో వాళ్లు ఫోన్లు పెట్టుకోని మన మాట కాకుండా వాళ్ల మాట్లే మాట్లాడకుంటా ఉండేది.''

''ఒరే! వాడి బతుకు వాడి బతగ్గలిగినోడు ఏ యదవ ఏం కూసుకుంటే మనకేమని వాడి దోవన వాడు పోతా ఉంటాడు. దోవ తప్పిన యదవలకే ఈ బాదలన్నీ!''

మా తల్లి సాచ్చిగా చెప్తా వుండా. ఇన్నాళ్లుగా ఈళ్లందురుకీ తలకాయిలుండేది ఎవురేం చెప్తే దాని కంతా అవునవునని గంగిరెద్దు మాదిర్తో ఊపే దానికే అనుకుంటా ఉంటి. ఇప్పుడు ఆలోచించే దాని కని తెల్సుకునే కుందికి నా పెగ్గె పెరమాళ్ల పల్లె దాకా పాయ!

ముత్తా రెడ్డన్న చెయ్యి నా బుజం మింద పడె!

''ఒరే అబ్బోడా! యింటా ఉండాన్రా. అంతా యింటా ఉండాన్రా. ఈ దేశాన్ని రాజులు పాలిస్తా ఉణ్ణెప్పుడు గూడచారులుణ్ణారు. దేశిం మింద పడి తిరిగేది. ఎవురు ఏమనుకుంటా వుండారో గ్రహించేది. వచ్చి రాజులకు ఎరిక పరిచేది. ఇదే వాళ్ల పని. ఈళ్లను గూడా నమ్మకుండా రాజులు అడపా దడపా మారు వేషాలేసుకోని దేశిం మిందికి పోతా ఉండిరి. మనలో ఏమన్నా లోపాలుండాయా? మనకు తెలవకుండానే ప్రెజలకేమన్నా చెడ్డా గిడ్డా జరగతా ఉండాదా? అని సాయంగా తెల్సుకునే దానికి పోతా ఉండిరి. ప్రెజల సుకం కోసరం వాళ్లు అంత స్రెమ పడ్తే యిప్పుడు మనదొరలు జల్సాగా యిండ్లల్లో కూసోనే యింకొకరి లోపాలు కనిపెట్టే దానికి దొంగ చెవులు పెట్టుకుణ్ణారు. ఎందుకంటే సందు చూసుకోని సమాది కట్టేదానికి!'' అనె.

మహన్నబావులు! మన దొరలు ఒకరి మిందొకరు పెట్నె నిగా ప్రెజల మింద స్రెద్ద అయ్యుంటే పైకి పంపించిన రాకెట్లు పైకే పొయ్యుండు గదా? అనుకుంటి. ●